క్లుప్తంగా

మల్బరీ తోటలు, షెడ్ల పరిశీలన



మేధినరావుపాలెంలో షెడ్డు, మల్బరీ తోటను పరిశీలిస్తున్న దృశ్యం

దెందులూరు: మండలంలో మల్బరీ సాగు చేస్తున్న రైతుల అభివృద్ధి లక్ష్యంగా నూరు శాతం నిర్మాణం లక్ష్యంగా సిబ్బంది కృషి చేస్తున్నారని మండల టెక్నికల్ అసిస్టెంట్ పి.రత్తయ్య అన్నారు. గురువారం మల్బరి సాగు చేస్తున్న మేధినరావుపాలెం, రామారావుగూడెం గ్రామాల్లో నిర్మాణం పూర్తయిన షెడ్లను, సాగులో ఉన్న తోటలను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ఇస్తున్న నూరుశాతం సబ్సిడీని మల్బరీ రైతులు సద్వినియోగం చేసుకుని సత్ఫలితాలు సాధించాన్నారు. ఇప్పటికే మండలంలో 43 షెడ్ల నిర్మాణం పూర్తయినట్టు చెప్పారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా రంగారావు



రంగారావును సత్కరిస్తున్న రమణమూర్తి, అవినాష్‌రాజు

దెందులూరు: ఏలూరు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా దెందులూరు మండలం ఉండ్రాజవరం గ్రామానికి చెందిన జరజాపు రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని రాష్ట్రపతి అవార్డు గ్రహీత బీవీ రమణమూర్తి, లయన్స్ క్లబ్ డైరెక్టర్ చుక్కా అవినాష్‌రాజు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 36 ఏళ్ల ఏలూరు డివిజన్‌లో ఆయన అందించిన సేవలను అవినాష్‌రాజు వివరించారు. గ్రామ శివారు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు అధికంగా చేయాలని ప్రెసిడెంట్ రంగారావుకు సూచించారు.

లక్ష్యాలను సాధించాలి



హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న ఎంఈఓలు

దెందులూరు: శాఖాపరమైన లక్ష్యాలను సాధించాలని ఎంఈఓలు ఏవీఎస్‌వీ ప్రసాద్, కె.అన్నమ్మ అన్నారు. గురువారం దోసపాడు పాఠశాలలో గ్రామ సర్పంచ్ జి.ఏసమ్మ, నాయకులు ఏసు, రంగరాజు, ఎం.వెంకటేశ్వరరావు, శ్రీను, ఉపాధ్యాయులు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు విధి నిర్వహణ పట్ల ఎంఈఓలు సంతృప్తి వ్యక్తం చేశారు. బడిబయట ఉన్న చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని, రుచికరమైన భోజనం అందించాలని సూచించారు.

గోపన్నపాలెంటో 'ఫ్యామిలీ డాక్టర్'



గోపన్నపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు

దెందులూరు: ఫ్యామిలీ డాక్టర్ పథకం వైద్యసేవలను వినియోగం చేసుకోవాలని గోపన్నపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.రాకేష్ అన్నారు. ప్రతి గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవల్లో భాగంగా గురువారం గోపన్నపాలెం పీహెచ్‌సీలో వైద్య సేవలు అందించారు. బీపీ, షుగర్, ఇతర రక్త పరీక్షలు నిర్వహించారు. ఏఎన్‌ఎం సుభాషిణి, వైద్య సిబ్బంది బాధితులకు ఆహారపు అలవాట్లు, వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఉద్యోగులకు న్యాయం చేయాలి



సీపీఎఫ్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

గణపవరం: రొయ్యల మేతల తయారీ సంస్థ సీపీఎఫ్ కంపెనీలో పర్మినెంట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ ఉద్యోగులు 33వ రోజు గురువారం తమ ఆందోళన కొనసాగించారు. ఇంతవరకూ అటు యాజమాన్యం, ఇటు ప్రభుత్వం తమ గోడు పట్టించుకున్న పాపాన పోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంపెనీ ఏర్పాటు చేసినప్పటి నుంచీ లాభాల్లో నడుస్తున్న కంపెనీని అకారణంగా మూసివేసి కార్మికులు, ఉద్యోగుల పొట్ట కొట్టారని వాపోయారు. జిల్లా కలెక్టరు, కార్మిక శాఖ అధికారులకు ఎన్ని వినతులు చేసినా ఫలితంలేదని వివరించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి



పూళ్లలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



దెందులూరు : పెదవేగి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న డాక్టర్లు పూర్ణిమ, మాధవి

భీమడోలు: జనాభా నియంత్రణతోనే దేశాభివృద్ధి సుసాధ్యమని పలువురు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గుండుగొలను, పూళ్ల పీహెచ్‌సీ పరిధిలో ర్యాలీలు నిర్వహించారు. గుండుగొలనులో వైద్యాధికారులు కె.శ్రీలక్ష్మి, జాహ్నవి సంయుక్త ఆధ్వర్యంలో, పూళ్లలో వైద్యులు కల్యాణ్‌మహేశ్వరి, అరుణజ్యోతిల ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామాల్లో ప్లకార్డులు చేతపట్టుకుని నినదిస్తూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. తల్లీబిడ్డ శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం అనే నినాదంతో వారంతా నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యవంతులు చేశారు. అభివృద్ధి చెందిన భారతదేశానికి కొత్త గుర్తింపు, కుటుంబ ప్రణాళిక అనేది దంపతులకు గర్వకారణమని నినదించారు. ఈనెల 24వ తేదీ వరకు కుటుంబ నియంత్రణ పద్ధతులను, సేవలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తామన్నారు. శాశ్వత కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించుకోవాలని వివరించారు. తద్వారా కుటుంబంతో పాటు దేశానికి మేలు జరుగుతుందని చెప్పారు. సరైన వయస్సులోనే వివాహం చేసుకోవాలని, బిడ్డకు బిడ్డకు అంతరం ఉండాలని ప్రసవాంతరం కుటుంబ పద్ధతులను అనుసరించాని అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఎంపీహెచ్‌ఈఓలు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుండుగొలనులో వైద్యులు, సిబ్బంది ప్రదర్శన



గణపవరం : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

అధిక జనాభాతో అనర్థాలే

గణపవరం: అధిక జనాభాతో అన్నీ అనర్థాలేనని, జనాభా నియంత్రణ వల్ల సమస్యల పరిష్కారం సులభమవుతుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి అన్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్, అర్థశాస్త్ర విభాగం, మహిళా సాధికారతల ఆధ్వర్యంలో జూనియర్ కాలేజీ, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అధిక జనాభాతో పోషకాహార సమస్య తలెత్తుతుందన్నారు. పోషకాహార లోపం, నైపుణ్యాలేమి దేశంలో ప్రధాన సమస్యలుగా ఉన్నాయని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భారతదేశ జనాభా అనుకూలతలు, ప్రతికూలలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన గోడ పత్రికలను విడుదల చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు చైతన్య, వెంకటరమణ, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే జనాభా నియంత్రణ

దెందులూరు: అవగాహనతోనే జనాభా నియంత్రణ సాధ్యపడుతుందని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారులు పూర్ణిమ, మాధవి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా గురువారం పెదవేగి పీహెచ్‌సీలో పెరుగుతున్న జనాభా, ఎదురవుతున్న ఆర్థిక, ఆరోగ్య, బలహీనతలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు పూర్ణిమ, మాధవి మాట్లాడుతూ సమాజంలో ప్రతి భార్య, భర్తలు పరిమిత సంతానం పొందాలని సూచించారు. బిడ్డకు బిడ్డకు కనీసం మూడేళ్ల వ్యవధి ఉండాలని అన్నారు. సూపర్‌వైజర్ సీహెచ్‌ఓ రోజ్‌మేరీ, సిబ్బంది పాల్గొన్నారు.

మరిన్ని క్లబ్‌ల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు నూకరాజు

దెందులూరు: ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ, అభివృద్ధికి గ్రామ శివారు ప్రాంతాల్లో వాకర్స్ క్లబ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తామని వాకర్స్ క్లబ్ దెందులూరు అధ్యక్షుడు, స్వచ్ఛంద సేవా సంస్థ మానవత మండల నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. గురువారం ఉదయం దెందులూరు జాతీయ రహదారిపై వాకర్స్ క్లబ్ సభ్యులు మార్నింగ్ వాక్ అనంతరం సమావేశం నిర్వహించారు. 17 పంచాయతీ శివారు గ్రామాల్లో ప్రాథమికంగా ఆరు క్లబ్‌ల ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. మారుతోన్న ఆరోగ్య పరిస్థితులు, ఆహార పరిస్థితులు, చిన్నవయస్సులోనే 60 శాతం మంది వివిధ వ్యాధుల బారిన పడటం వంటి ప్రమాదకర పరిస్థితుల దృష్ట్యా నడక వల్ల ఉపయోగాలు చెప్పాలన్నదే తమ క్లబ్ లక్ష్యమని వివరించారు. ఇప్పటికే దెందులూరులో ఉచితంగా యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

బుట్టాయగూడెం: ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటన కంసాలికుంట సమీపంలో గురువారం జరిగింది. బుట్టాయగూడెం ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసవర్మ కొయ్యలగూడెం నుంచి ద్విచక్ర వాహనంపై బుట్టాయగూడెం వస్తున్నారు. అలాగే మండలంలోని రాచూకుకు చెందిన వెట్టి చందు అనే యువకుడు బుట్టాయగూడెం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో వారిరువురూ కంసాలికుంట సమీపంలో ఎదురెదురుగా వస్తూ అదుపు తప్పి ఢీకొట్టుకున్నారు. ఇరువురికీ గాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వాకపల్లి గ్రామానికి అవార్డు

గణపవరం: గణపవరం మండలం వాకపల్లి గ్రామం టీబీ విముక్త పంచాయతీగా అవార్డు పొందింది. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చేతుల మీదుగా వాకపల్లి సర్పంచ్ ఆదిమూలం శ్రీనివాస్ అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. గణపవరం పీహెచ్‌సీ పరిధిలోని ఎ.గోపవరం, వెలగపల్లి గ్రామాలుకూడా టీబీ విముక్త గ్రామాలుగా ఎంపికయ్యాయి. ఇందుకుగాను పీహెచ్‌సీ వైద్యాధికారి పులపర్తి సంతోష్, సీహెచ్‌ఓ జాలాది విల్సన్‌లు జిల్లా కలెక్టరు, జిల్లావైద్య ఆరోగ్యశాఖ అధికారి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.



కలెక్టర్ నాగరాణి నుంచి అవార్డు అందుకుంటున్న వాకపల్లి సర్పంచ్ శ్రీనివాస్

ప్రతి వెయ్యి మంది జనాభాకు 30 మందికి టీబీ టెస్టులు చేసినందుకు ఆ గ్రామ సర్పంచ్‌లు కూడా అవార్డులు అందుకున్నారు.

కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం

పెదపాడు : విద్యార్థులు ప్రభుత్వంతో పాటు దాతలు అందించిన మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. పెదపాడు మండలం వట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఎన్నారైలు ఉత్తర అమెరికా తెలుగు సంఘం చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని అధ్యక్ష, ఉపాధ్యక్షులు మదన్ పాములపాటి, దూళిపాళ భాను ప్రకాష్ సాయం రూ.3 లక్షల వ్యయంతో 10 కంప్యూటర్లు ఏర్పాటు చేయడంతో పాటు కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్లను ఏర్పాటు చేసి విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించడం మంచి పరిణామమని ఎమ్మెల్యే అన్నారు. కంప్యూటర్ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. పాఠశాలలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను, మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ ఎస్ అబ్రహం, ఎంపీడీఓ జె.తేజరతన్, ఎంఈఓలు సర్సింహమూర్తి, డీవీరమణ, టీడీపీ నాయకులు ఉప్పలపాటి రాం ప్రసాద్, గుత్తా అనీల్, అక్కినేని వంశీ కొమ్మన లక్ష్మణ మోహన్, నూతలపాటి నవీన్, ముళ్లపూడి సాంబశివరావు, వేగుంట సురేష్, సాగర్, నాని తదితులు పాల్గొన్నారు.



వట్లూరు హైస్కూల్లో ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే చింతమనేని

చాంపియన్‌షిప్‌లో సుభాష్‌కు తృతీయ స్థానం



అవార్డును అందుకుంటున్న చిన్నారి ప్రతిభ సరోజారెడ్డి

జంగారెడ్డిగూడెం: కర్ణాటక స్టేట్ మెమోరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జంగారెడ్డిగూడెం ప్రతిభ స్కూలు అకడమిక్ డైరెక్టర్ కాసర సుభాష్‌రెడ్డికి తృతీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో సుభాష్ తృతీయ స్థానంలో నిలిచి సెకండ్ రన్నరప్ ట్రోఫీ, కాంస్య పతకంతోపాటు వివిధ ఈవెంట్స్‌లో ఐదు మెడల్స్ సాధించారు. రాండం వర్డ్స్ ఈవెంట్‌లో ఐదు నిమిషాల్లో 80 పదాలు గుర్తుపెట్టుకుని రాయడంతో వెండి పతకం సాధించినట్లు చెప్పారు. అలాగే 7వ తరగతి చదువుతున్న ప్రతిభ సరోజ్ రెడ్డి కిడ్స్ విభాగంలో రెండు పతకాలు సాధించినట్లు చెప్పారు. ర్యాండం వర్డ్స్ ఈవెంట్ లో 4వ స్థానం, బైనరీ నెంబర్స్ ఈవెంట్ లో 7వ స్థానంతో రెండు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ స్కూల్లో నిర్వహించిన అభినందన సభలో సుభాష్, ప్రతిభకు డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: మండలంలోని వివిధ సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్త శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీవీవీజీ నటరాజన్ తెలిపారు. గంగన్నగూడెం, అక్కిరెడ్డిగూడెం, నాగులదేవునిపాడు, సానిగూడెం, దోసపాడు, సత్యనారాయణపురం, కొత్తగూడెం, కొమిరేపల్లి, రామారావుగూడెం, మేధినరావుపాలెం, ధర్మారావుపేట, మలకచర్ల గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కలపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..

పెదపాడు : కలపర్రు, కలపర్రు రూరల్, ఏపూరు సబ్‌స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. కలపర్రు, కొక్కిరపాడు, వట్లూరు, అప్పనవీడు, ఏపూరు, తాళ్లమూడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

డిగ్రీలో ప్రవేశానికి గడువు పొడిగింపు

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినటుట ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయంతో డిగ్రీలో ప్రవేశానికి మరో పదిరోజులు గడువు పెరిగిందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు నియోజకవర్గ సమీక్ష

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశం శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు నారాయణపురం లయన్సు ఆడిటోరియంలో ఏర్పాటుచేసినట్టు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు వ్యక్తి గత సహాయకుడు కె. సత్యనారాయణ తెలిపారు. ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో అధికారులంతా హాజరవుతారని పేర్కొన్నారు. వర్షాకాలంలో వరదలపైనా చర్చిస్తారని తెలిపారు.

కొండముచ్చు దాడిలో విద్యార్థికి గాయాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఓ విద్యార్థిని కొండముచ్చు దాడి చేసి కరిచింది. 9వ తరగతి చదువుతున్న తెల్లం వంశీని కొండముచ్చు కరవగా అతనిని ఉపాధ్యాయులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇటీవల ఒకరిద్దరిని కరిచినట్లు చెబుతున్నారు. హైస్కూల్ పరిసర ప్రాంతంలోనే కొంత కాలంగా తిరుగుతోంది. విద్యార్థులతో కలిసి భోజనం కూడా చేస్తోంది. అయితే విద్యార్థులు దానిని కొట్టడంతో తిరగబడుతోందని చెబుతున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం





మహిళా చట్టాలపై మాట్లాడుతున్న జడ్జి రాజరాజేశ్వరి తేజస్విని, హాజరైన మహిళలు, పోలీసు సిబ్బంది

ఏలూరు (టూటౌన్): చట్టాలు, చదువుతో పాటు, సమాజంలో ప్రతి విషయంపైనా అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం రాజరాజేశ్వరి తేజస్విని మహిళలకు సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో మహిళా చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ, స్వాతి మహిళా అభ్యుదయ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో ట్రైనీ జడ్జిలు ఎం రాజరాజేశ్వరి తేజస్విని, పీవీఎస్ఎన్ లక్ష్మీ లావణ్య, పీవీ నాగ రంజిత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జడ్జి రాజరాజేశ్వరి తేజస్విని మాట్లాడుతూ మహిళలు సమాజంలో జరిగే ప్రతి విషయంపైనా పూర్తి అవగాహన కలిగి ఉన్నప్పుడే సమస్యలను ఎదుర్కొనవచ్చని అన్నారు. ప్రతి అంశంలో పురుషులతో సమానంగా పోటీపడుతున్నప్పటికీ ఎక్కడో ఒక చోట సమస్యలు ఎదుర్కొనాల్సి వస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ సమస్యలపై పోరాడాలని సూచించారు. నేడు మానవ అక్రమరవాణా విరివిగా జరుగుతోందని, ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని మహిళలకు సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టం కఠినమైన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ మంగా కుమారి, ప్యానల్ అడ్వకేట్ కూనా కృష్ణారావు, పి.రత్నరాజు, టి.సుబ్బారావు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో స్థానికులనే నియమించాలి

ఏలూరు (టూటౌన్): ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో స్థానికులనే నియమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. గురువారం పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న బుట్టాయగూడెం, విప్పలపాడులలో ఉన్న ఏకైక ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలో పర్మినెంట్ ఉద్యోగులుగా ఉత్తరాదికి చెందిన 18 మందిని నియమించడం దురదృష్టకరమన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దక్షినాదిలో హిందీని బలవంతంగా రుద్దాలనే అజెండాలో భాగంగానే ఈ విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. హిందీ మాత్రమే వచ్చిన వారు ఇక్కడ ఏ భాషలో విద్యాబోధన చేయగలుగుతారని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాకు చెందిన చంద్రశేఖరపురంలో ఉన్న ఏకలవ్యవ గిరిజన గురుకుల పాఠశాలకు వెళ్లిన విద్యార్థులను హిందీలో మాత్రమే సమస్యలు తెలిపాలంటూ, హిందీ రాకపోతే అసలు రావద్దంటూ ప్రిన్సిపాల్ చెప్పారనే వార్తలు రావడం విచారకరమని తెలిపారు. అక్కడ ఇంగ్లీషు పాఠాలు కూడా హిందీలోనే చెబుతున్నట్టు తెలిసిందన్నారు. ఈ రకంగా వ్యవహరిస్తే విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పద్ధతి గిరిజనులను ఉన్నత విద్యల నుంచి దూరం చేసే కుట్రలో భాగంగానే పరిగణించాల్సి వస్తుందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి కొత్త ప్రభుత్వం ఈ విషయంలో తెలుగు రాష్ట్రంలో ఈ ప్రాంతాలకు చెందిన వారిని మాత్రమే నియమించాలని రవి కోరారు. స్థానిక భాషలో విద్యా బోధన చేసే విధంగా స్థానికులను మాత్రమే ఏకలవ్య గిరిజన గురుకుల పాఠశాలల్లో నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రవి

లక్ష్యాలను సాధించాలి

ఏలూరు రూరల్ : లక్ష్యాలను నిర్దేశించుకుని ఇష్టపడి చదవి సాధించుకోవాలని ఎంపీడీఓ బి.ప్రణవి విద్యార్థులకు సూచించారు. గురువారం ఆమె ఏలూరు రూరల్ మండల గ్రామాల్లో జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలను సందర్శించారు. తరగతి గదుల్లో మౌలిక వసతులు, తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత పరిశీలించారు. బాలబాలికలకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని హెచ్ఎంలకు సూచించా రు. మాదేపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించారు. బోర్డుపై భారతదేశ మ్యాప్ గీయించి, వివిధ రాష్ట్రాలు, ప్రాంతాలను గుర్తించమన్నారు. 10వ తరగతి సిలబస్ మారినందున మరింత శ్రద్ధతో చదవాలన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రణవి

24 గంటల్లోనే సమస్యల పరిష్కారానికి చర్యలు

నగర కమిషనర్ వెంకటకృష్ణ

ఏలూరు టౌన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేశామని, ఫిర్యాదులను 24 గంటల్లోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని ఏలూరు కమిషనర్ వెంకటకృష్ణ తెలిపారు. కమాండ్ కంట్రోల్ ఫోన్ నెంబర్ 89789 99955, టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 4287, ల్యాండ్ లైన్ నెంబర్ 08812 232101కు సమస్యలపై ఫిర్యాదు చేయాలని కోరారు. ఆయన గురువారం తెల్లవారుజాము నుంచీ ఉదయం 8 గంటల వరకు నగరంలో విస్తృతంగా పర్యటించారు. నవయుగ హోటల్, సాయినగర్ సచివాలయంలోనూ పారిశుధ్య కార్మికుల హాజరును పరిశీలించారు. కార్మికులు సక్రమంగా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోణంగిలోని చెత్త, వ్యర్థాల డంపింగ్ యార్డ్‌ను, వర్మీ కంపోస్ట్ యూనిట్‌ను కమిషనర్ పరిశీలించారు. రాజరాజేశ్వరి నగర్‌లో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. పత్తేబాద రైతుబజార్, వన్‌టౌన్‌లోని రైతుబజార్‌లను సందర్శించారు. అక్కడి పరిస్థితులను ఎస్టేట్ ఆఫీసర్‌లతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వెంకట కృష్ణ మాట్లాడుతూ ఏలూరు నగరంలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టామని తెలిపారు.



రాజరాజేశ్వరి నగర్‌లో సమస్యలు అడిగి తెలుసుకుంటోన్న నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ

మేకల కబేళా అభివృద్ధికి చర్యలు

జంతువధశాల (మేకల కబేళా) అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణతో కలిసి ఆయన ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని మేకల కబేళాను గురువారం సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈ కొండలరావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, డీఈ తాతబ్బాయి, ఏఈలు సాయి, రాఘవేణి, కబేళా సభ్యులు ఉన్నారు.